# తెగ తాగేశారు..!

వైరా : మద్యం అమ్మకాలు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. రెండేళ్ల కాలపరిమితితో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు విజయవంతంగా ఏడాది పూర్తి చేశారు. 2023 డిసెంబర్ నుంచి గతనెల నవంబర్ వరకు మద్యం వ్యాపారులు తమ ఏడాది కాలపరిమితిని ముగించుకోగా ప్రస్తుతం రెండో ఏడాదిలోకి ప్రవేశించారు. ఈ ఏడాది కాలంలో మద్యం అమ్మకాలు తారాస్థాయిలో జరగడం విశేషం.

**ఉమ్మడి జిల్లాలో..**

ఉమ్మడి జిల్లాలో 210 మద్యం దుకాణాలు, 48 బార్లు, 3 క్లబ్బులున్నాయి. వీటన్నింటికి వైరాలోని డిపో నుంచే మద్యం పంపిణీ చేస్తుంటారు. డిపో నుంచి వ్యాపారులకు ఇన్వాయిస్ ధరపై మద్యం అందిస్తుండగా వాటికి తమ లాభ శాతంను జోడించి ఎమ్మార్పీ ధరకు విక్రయించాల్సి



ఉంది. గత డిసెంబర్ నుంచి నవంబర్ వరకు రూ.2,378 కోట్ల మద్యంను వ్యాపారులు డిపో నుంచి ఇన్వాయిస్ ధరపై కొనుగోలు చేశారు. ఎమ్మార్పీ ప్రకారం వీటి విలువ రూ.2,800 కోట్ల పైమాటే అని అధికార వర్గాలు ధ్రువీకరించాయి. మొత్తంగా 30.57 వేల లిక్కర్ కేసులు, 19.41 వేల బీర్ల కేసులు విక్రయించారు.

**బెల్టుషాపులే ప్రధానం**

మద్యం అమ్మకాలు సింహభాగం బెల్టుషాపుల్లోనే జరుగుతుంటాయి. నిబంధనలకు విరుద్ధంగా వీటిని ఏర్పాటు చేస్తున్నా నియంత్రించడం లేదు. మద్యం అమ్మకాలను ప్రతినెలా పెంచాలనే లక్ష్యం ప్రభుత్వస్థాయి నుంచే ఉంటుంది. దీంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు చేసేది లేక బెల్టుషాపులను అందుకు ప్రోత్సహిస్తున్నారు. ప్రతి మండలంలో 150 నుంచి 200లకుపైగా వీటి సంఖ్య ఉండగా ఉమ్మడి జిల్లాలో 7 వేల వరకు బెల్టుషాపులు ఉన్నట్లు అంచనా. ఈ కారణంగా మద్యం అమ్మకాలు తారాస్థాయిలో జరుగుతున్నాయి. కానీ ఏపీలో ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మద్యం అమ్మకాలు కాస్త తగ్గినట్లు అంచనా. అప్పటి వరకు దొరకని అన్నిరకాల బ్రాండ్లు ఏపీలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లభ్యమవుతుండటం దీనికి కారణంగా భావిస్తున్నారు. దీనికితోడు అక్టోబర్ నుంచి జనవరి వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉండటంతో అమ్మకాల సంఖ్యలో తగ్గుదల కనిపించినప్పటికీ వార్షిక పొడవున చూస్తే అమ్మకాల వృద్ధి కనిపిస్తోంది.

# నేలతల్లి కడుపుకోత..!

కొత్తగూడెం :ఇప్పటికే మూడింట ఒకవంతు నేల క్షీణతకు గురైంది. ఈపరిస్థితులే కొనసాగితే 60ఏళ్లలో ప్రపంచంలోని నేల పైపొర పూర్తిగా దెబ్బతింటుంది. రెండేళ్ల క్రితమే ఐక్యరాజ్యసమితి అనుబంధ ఆహార, వ్యవసాయ సంస్థ(ఎఫ్ఏఓ) హెచ్చరించిందిలా. ?రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల భద్రాద్రి జిల్లా గుండాల మండలంలో భూసారం దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. ఏళ్ల తరబడి ఒకేరకమైన పంట(మొక్కజొన్న) పండించటం, అధిక మొత్తంలో యూరియా ఉపయోగించటంతో నత్రజని లోపం తీవ్రస్థాయిలో ఉందని చెబుతున్నారు. జిల్లాలో విచ్చలవిడిగా పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం, భారీ వర్షాల కారణంగా భూమి కోతకు గురవటం వంటివి పంటపొలాలను నిస్సారంగా మార్చుతున్నాయంటున్నారు. మనిషి ఉనికికి, జీవనానికి మట్టే మూలాధారం. ఆరోగ్యకరమైన నేల ఉన్నప్పుడే జనాభాను పోషించటానికి కావాల్సిన ఆహారోత్పత్తి సాధ్యమవుతుంది. మితిమీరిన మానవ కార్యకలాపాలు, విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో నేల పైపొర దెబ్బతింటోందని నిపుణులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఆహారభద్రతపై పెనుప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. ఈఏడాది 'కేరింగ్ ఫర్ సాయిల్' అనే నినాదంతో ప్రపంచ మృత్తికా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

**కలవరపరుస్తున్న మృత్తికా క్రమక్షయం**

భూమి పైపొర క్రమంగా క్షీణించటాన్ని మృత్తికా క్రమక్షయంగా పిలుస్తారు. వరదలు, రసాయన వ్యవసాయం, అటవీ నిర్మూలన, కాలుష్యం, ప్లాస్టిక్, రసాయన వ్యర్థాల చేరిక వంటి కారణాలతో నేల దెబ్బతింటోంది. నేల పైపొర పోషకాల ఖజానా.. అందులో నైట్రోజన్, భాస్వరం, సల్ఫర్ వంటివి ఉంటాయి. ఉభయ జిల్లాల్లో రెండేళ్లలో కురిసిన భారీ వర్షాలతో వేలాది ఎకరాల్లో భూమి కోతకు గురైంది. టన్నులకొద్దీ చెత్త భూమిపై పేరుకుపోతోంది. నేల సహజ సారం దెబ్బతినటం వల్ల పంటల దిగుబడి భారీగా తగ్గుతోంది. దిగుబడి పెంచేందుకు ఎరువుల వాడకం అధికమవుతోంది.

**హెచ్చుమీరుతున్న ఎరువుల వినియోగం**

ఖమ్మం జిల్లాలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఇతరత్రా ఎరువులను ఏటా వర్షాకాలంలో సుమారు 75వేలు, యాసంగిలో 70వేల మెట్రిక్ టన్నులు, భద్రాద్రి జిల్లాలో వర్షాకాలంలో సుమారు 65వేలు, యాసంగిలో 60వేల మెట్రిక్ టన్నులు వాడుతున్నట్లు అంచనా. విచ్చలవిడి రసాయన ఎరువుల వినియోగం వల్ల భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. ఉభయ జిల్లాల్లో రోజుకు సుమారు 600 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతుంటే అందులో 30శాతం (180 మెట్రిక్ టన్నులు) ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.

**మట్టిని కాపాడుకుందామిలా..**

వృక్ష సంపదను పెంచటం వల్ల వాటి వేర్లు నేల కోతలను తగ్గిస్తాయి.
నేల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు రసాయన ఎరువుల స్థానంలో కంపోస్టు, సేంద్రియ ఎరువులు వాడుకోవాలి.
భూసారాన్ని పెంచేందుకు క్రమం తప్పకుండా పంటమార్పిడి చేయాలి.
నీటిని పొదుపుగా వాడుకోవటానికి డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులు ఉపయోగించాలి.
ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిపై పేరుకుపోకుండా చూడాలి. హానికరమైన రసాయనాలను వాడొద్దుపంట వ్యర్థాలను కాల్చకుండా కలియదున్నటం వల్ల సేంద్రియ పదార్థాలు కలిసి నేల సారవంతమవుతుంది.
రసాయన ఎరువులు, పురుగు, కలుపు మందులను అధికంగా వాడటంతో నేల సారంతో పాటు పర్యావరణం దెబ్బతింటోంది. క్రమం తప్పకుండా భూసార పరీక్షలు నిర్వహిస్తూ వాటి ఫలితాలకు అనుగుణంగా ఎరువులను వినియోగించాలి.శ్రీనివాసరావు, కేవీకే శాస్త్రవేత్త, కొత్తగూడెం

# వైద్యుల్లేక.. మందులివ్వక.. నిరీక్షించే 'ఓపీ'క లేక..



హైదరాబాద్ : గ్రేటర్‌లో పింఛనుదారులు, వృద్ధుల కోసం నెలకొల్పిన వెల్‌నెస్ కేంద్రాల్లో సేవలు మృగ్యమవుతున్నాయి. సరిపడా వైద్యులు, సిబ్బంది లేక ఆ ప్రభావం సేవలపై పడుతోంది. మందులు కూడా అరకొరగానే సరఫరా చేస్తున్నారు. ఖైరతాబాద్, వనస్థలిపురం, కూకట్‌పల్లిలో ఈ కేంద్రాలున్నాయి. వైద్యంతోపాటు దాదాపు 50 రకాల పరీక్షలు అందుబాటులోకి తెచ్చారు. అధిక రక్తపోటు, మధుమేహం, మలేరియా, డెంగీ, ఈసీజీ, 2డీ ఈకో, ఇతర రక్త పరీక్షలు ఇక్కడే చేయించుకొని మందులు తీసుకునేవారు. చివరికి ఇవి నామ్‌కే వాస్తేగా మారాయి.

**వనస్థలిపురంలో..**

వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలోని వెల్‌నెస్ సెంటర్‌కు విశ్రాంత ఉద్యోగులు, జర్నలిస్టులు వస్తారు. గతంలో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం నలుగురు జనరల్ మెడిసిన్ వైద్యులు, నేత్ర వైద్యుడు, డెంటిస్టు, ఫిజియోథెరపిస్ట్ మాత్రమే ఉన్నారు. నెలక్రితం స్త్రీ వైద్య నిపుణురాలు వెళ్లిపోవడంతో ఇంతవరకు మరో వైద్యురాలిని నియమించలేదు. గతంలో ఉన్న కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్ వైద్యులు ప్రస్తుతం అందుబాటులో లేరు.

**కూకట్‌పల్లిలో..**

కూకట్‌పల్లి వెల్‌నెస్ సెంటర్‌లో సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఫార్మసిస్టు, డేటా ఎంట్రీ ఆపరేటర్, నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వృద్ధులకు ఎంతో అవసరమైన ఫిజియోథెరపీ సేవలు లేవు. 5 నెలల క్రితం ఫిజియోథెరపిస్టు రాజీనామా చేసి వెళ్లిపోవడంతో ఆ స్థానం భర్తీ చేయలేదు. ఫార్మసిస్టు లేక వైద్యుడే రోగులకు మందులు ఇవ్వాల్సి వస్తోంది. బీపీ, మధుమేహం రోగులకు 3 నెలలకు ఒకసారి మందులు ఇచ్చేవారు. ఇప్పుడు ఒక నెలకే ఇస్తున్నారు.

**ఖైరతాబాద్‌లో..**

ఖైరతాబాద్ వెల్‌నెస్ కేంద్రంలో గతంలో రోజుకు 200 మంది వరకు ఓపీకి వచ్చేవారు. వైద్యులు బదిలీపై వెళ్లిపోవడం, పరీక్షలు లేకపోవడంతో వచ్చేవారు తగ్గిపోయారు. ఇటీవలే నలుగురు నర్సులు రాజీనామా చేసి వెళ్లిపోయారు. వేరేదారి లేక రోగులు నిమ్స్‌కు రిఫర్ చేయించుకుని అక్కడికి వెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి సేవలను మెరుగుపరచాలని కోరుతున్నారు.

**అన్ని పరీక్షలకూ ఎదురుచూపులే**

గతంలో వెల్‌నెస్ కేంద్రంలోనే అన్నిరకాల పరీక్షలు చేసేవారు. వృద్ధులు, పింఛన్‌దారులు ఉదయం వెళ్లి పరీక్షలు చేయించుకొని, మందులు తీసుకొని మధ్యాహ్నంకల్లా ఇంటికి వచ్చేవారు. తర్వాత వీటిలో అన్నిరకాల పరీక్షలను నిలుపుదల చేశారు. నారాయణగూడలోని తెలంగాణ డయోగ్నోస్టిక్ కేంద్రంతో ఈ వెల్‌నెస్ కేంద్రాలను అనుసంధానించారు. ఫలితాలు ఒక్కోసారి 48 గంటల తర్వాత కూడా అందడం లేదు. మధుమేహంలాంటి పరీక్షలకు రెండురోజుల సమయం పడుతోంది.

# కమీషన్ అందక.. కష్టాలు తీరక!



ఖమ్మం : ధాన్యం కొనుగోళ్లలో రైతులకు అండగా నిలుస్తున్న అతివలకు వడ్ల కమీషన్ కోసం నిరీక్షణ తప్పటం లేదు. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నిర్వహిస్తున్నా సకాలంలో కమీషన్ అందక మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. భద్రాద్రి జిల్లాలో 2023 యాసంగి, వానాకాలం, 2024 యాసంగిలో 22 మహిళా సంఘాలు, ఖమ్మం జిల్లాలో 2023 యాసంగిలో 52 సంఘాలు, 2023 వానాకాలం, 2024 యాసంగిలో 141 మహిళా సంఘాలు ధాన్యం సేకరించాయి. కొనుగోలు కేంద్రాల్లో వడ్ల తేమను పరిశీలించటం, ధాన్యం కొని మిల్లులకు తరలించటం, ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో చేరే వరకు ఈ సంఘాలు బాధ్యత వహిస్తున్నాయి. ఈ మూడు సీజన్లకు సంబంధించి మహిళా సంఘాలకు రూ.3కోట్ల మేర ధాన్యం కమీషన్ బకాయిలు పేరుకుపోయాయి.

**క్వింటాకు రూ.32 చొప్పున**

ప్రభుత్వం సేకరించిన ధాన్యంలో క్వింటాకు రూ.32 చొప్పున కమీషన్ మహిళా సంఘాలకు అందాలి. దీని నుంచి ఐకేపీ, సీఏ, బుక్ కీపర్, ఇద్దరు గ్రామైక్య మహిళలు.. ఇలా నలుగురు రోజువారీ కూలి తీసుకుంటారు. కూలి, నిర్వహణ ఖర్చులు పోనూ మిగతా డబ్బులు సంఘంలో జమచేస్తారు. వాస్తవానికి ఒక సీజన్‌లో ధాన్యం సేకరిస్తున్న సమయంలోనే రైతులకు వడ్ల సొమ్ము ఖాతాల్లో జమవుతుంది. ఈ విధంగానే మహిళా సంఘాలకూ సీజన్ పూర్తవగానే కమీషన్ సొమ్ము జమవ్వాల్సి ఉన్నా అందటం లేదు. భద్రాద్రి జిల్లాలో రూ.30-50 లక్షలు, ఖమ్మం జిల్లాలో రూ.2.50 కోట్ల పైచిలుకు బకాయిలు పేరుకుపోయినట్లు సమాచారం. రోజువారీ మహిళా కూలీలతో పోల్చుకుంటే.. ధాన్యం కేంద్రాల్లో పనిచేస్తున్న అతివలకు తక్కువ కూలి అందుతుంది. అయినా అదీ సకాలంలో అందకపోవటంతో ఇబ్బందులు పడుతున్నామని మహిళా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మా సంఘం ఆధ్వర్యంలో రెండేళ్లుగా వడ్లు కొంటున్నాం. గత మూడు సీజన్లకు సంబంధించిన కమీషన్ ఇంతవరకు అందలేదు. దాదాపు రూ.10లక్షల వరకుబకాయిలు పేరుకుపోయాయి. ఆర్.దుర్గ, గ్రామదీపిక, నీలాద్రి గ్రామ సమాఖ్య, పెనుబల్లి మండలం

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా మాసంఘాన్ని బలోపేతం చేసుకుంటున్నాం. గత మూడు సీజన్ల నుంచి కమీషన్ డబ్బులు అందలేదు. సుమారు రూ.4 లక్షల వరకు కమీషన్ రావాల్సి ఉంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నా ఈసారీ ధాన్యం కొంటున్నాం. దొడ్డా కుమారి, అడసర్లపాడు, వేంసూరు మండలం

ధాన్యం కొంటున్న మహిళా సంఘాలకు కమీషన్ రూపంలో అందాల్సిన సొమ్ము పెండింగ్‌లో ఉంది. మూడు సీజన్ల కమీషన్ డబ్బు అందించాల్సి ఉండగా.. తొలి సీజన్‌లో 50 శాతం కమీషన్ చెల్లించాం. త్వరలోనే మిగతా బకాయిలు అందేలా చూస్తాం.శ్రీలత, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ, ఖమ్మం

# సామాజిక కోణం.. ఆదుకోవడమే లక్ష్యం

గోదావరిఖని: ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్న.. అన్న నానుడిని ఎంతోమంది నిజంచేస్తూ స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో అనేక స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతూ ఆపన్నులకు అండగా నిలుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 400కు పైగా ఎన్జీవో సంస్థలు పనిచేస్తున్నాయి. చాలావరకు పేద కుటుంబాలను ఆదుకోవడంతో పాటు రక్తదానాలు చేస్తూ ఎంతో మంది ప్రాణాలను కాపాడుతు న్నారు. అనారోగ్య బాధితులకు వైద్యం కోసం ఆర్థిక సాయం చేస్తున్నారు. పేద ఆడపిల్లల వివాహాలకు సహకారం అందిస్తున్నారు. నిరుపేదలకు స్వచ్ఛందంగా ఇళ్లు నిర్మించి ఇస్తున్నారు. నేడు అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..ఉమ్మడి జిల్లాలో ప్రజలను చైతన్యం చేస్తూ ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతోంది సదాశయ ఫౌండేషన్. అవయవ, నేత్ర, శరీరదానాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఎంతోమందికి మేలు చేస్తున్నారు. ప్రతినిధులు చేపడుతున్న అవగాహన కార్యక్రమాలతో ఎంతో మంది ముందుకు వచ్చి నేత్ర, శరీర, అవయవదానాలు చేశారు. సామాజిక సేవలో నిరంతరం పనిచేస్తున్న సభ్యులు ఎంతో మంది అంధులకు కంటిచూపును ప్రసాదించేందుకు తమవంతు సహకారం అందిస్తున్నారు. ఇప్పటి వరకు నేత్ర 1250, అవయవ దానాలు 90, దేహదానం 130 చేయించారు. 1350 అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. దాదాపు 60 వేల మంది నేత్ర, దేహ, అవయవదానానికి అంగీకార పత్రాలు అందజేశారు.కరీంనగర్‌కు చెందిన పేద మహిళకు ఉపాధి కల్పించేందుకు మేముసైతం యువసేన ఫౌండేషన్ వ్యవస్థాపకులు చకిలం స్వప్న ఆధ్వర్యంలో . కుట్టు యంత్రాన్ని అందించారు. కరీంనగర్‌లో స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న స్వప్న సామాజిక కార్యక్రమాలతో పాటు నిరుపేద యువతుల వివాహానికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఆకలితో అలమటించే వారికి అన్నదానాలు చేస్తూ సేవా నిరతి చాటుకుంటున్నారు. పెద్దపల్లి జిల్లా ఎల్కలపల్లికి చెందిన చిన్నారికి కాలేయ మార్పిడి అవసరం ఏర్పడింది. స్పందించిన నీడ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అందుకు అవసరమైన డబ్బులను సమీకరించారు. కాలేయ మార్పిడికి రూ.17 లక్షల ఆర్థిక సాయం అందించి చిన్నారి ప్రాణాన్ని కాపాడారు. ఏడాదిన్నర వయసులో కాలేయ మార్పిడి చేయించడంతో ప్రస్తుతం ఆ అమ్మాయి ఆరోగ్యంగా ఉంది. నీడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎంతోమంది పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చారు. అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

జగిత్యాల జిల్లా మల్యాలకు చెందిన దొంతరవేణి శేఖర్ సొంతంగా సామాజిక కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారు. తన వంతుగా సేవా కార్యక్రమాలు చేయాలన్న సంకల్పంతో రూ.3 లక్షలతో బస్టాండ్ నిర్మించారు. ఖబ్రస్థాన్‌లో బోరు వేయించారు. పేద ఆడపిల్లల వివాహాలకు ఆర్థికసాయం అందిస్తున్నారు.

**మేమున్నామంటూ...**ఉమ్మడి జిల్లాకు చెందిన స్వచ్ఛంద సంస్థలు ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ అండగా నిలుస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలతో పాటు లయన్స్‌క్లబ్‌లు కూడా సామాజిక బాధ్యతను నిర్వహిస్తున్నాయి. అనారోగ్య బాధితుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వైద్యం కోసం ఆర్థికసాయం చేస్తున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సైతం కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించి వారి ప్రాణాలను నిలబెట్టిన సంస్థలున్నాయి. ప్రజల్లో అవగాహనకే ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంస్థను 2008 అక్టోబరులో ప్రారంభించాం. ఎంతో మంది అంధులకు చూపు ప్రసాదించాలంటే నేత్రదానం అవశ్యం. వివిధ రోడ్డు ప్రమాదాల్లో శరీరంలోని అవయవాలు దెబ్బతిని ప్రాణాలు కోల్పోతున్న వారున్నారు. వారికి అవసరమైన అవయవాలు దానం చేయడానికి దాతలు ముందుకు రావాలి. అవయవదానంపై చాలా మందిలో అపోహలున్నాయి. మృతిచెందిన అనంతరం అవయవాలు మట్టిపాలు కాకుండా దానం చేస్తే ఎంతోమందికి మేలు జరుగుతుంది. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఎంతోమంది మరణానంతరం తమ అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు.లింగమూర్తి, సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి

# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి

పాల్వంచ : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలపై ఆ విభాగం రాష్ట్ర శాఖ దృష్టిసారించింది. ఇప్పటి వరకు ఓ లెక్క.. ఇక నుంచి ఓ లెక్క అంటూ ఆ విద్యాశాఖ సంచాలకుడు జిల్లా అధికారుల(డీఐఈవో)కు తాజాగా దిశానిర్దేశం చేశారు. 'కేవలం ప్రభుత్వ కళాశాలలే కాదు. ప్రభుత్వ అనుబంధ (సెక్టార్) ఎయిడెడ్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలపైనా దృష్టిసారించాలి' అని సూచించారు. అన్ని యాజమాన్యాల కళాశాలల సమన్వయంతో జిల్లాల వారీగా మెరుగైన ఫలితాలు సాధ్యమని ఆ శాఖ భావిస్తోంది. ఈ క్రమంలో '90 రోజుల ప్రత్యేక కార్యాచరణ' అమలుపై ఆదేశాలిచ్చారు. ఇందులో భాగంగా డిసెంబరు, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రతి విద్యార్థిపై శ్రద్ధ చూపాలి. వారు వార్షిక



ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించేలా చూడాలి. అధ్యాపకుడు, కోర్సు బాధ్యులు, ప్రిన్సిపాళ్లు ప్రధాన భూమిక పోషించేలా ప్రణాళిక ఉండాలని సూచించారు. ఇదే క్రమంలో విద్యార్థులు పరీక్ష అనగానే ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు వచ్చే మూణ్నెల్ల పాటు డీఐఈవోలు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి. ప్రతిరోజు మండలాల వారీగా కళాశాలల్ని పర్యవేక్షించాలి.

**ఇదీ.. ప్రణాళిక**

డీఐఈవోలు నెలవారీ క్షేత్ర పర్యటన (టూర్ డైరీ)ని నెలవారీగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు నివేదించాలి. ప్రతి మండలంలో విద్యార్థుల స్థితిగతులను తెలుసుకోవడం దీని ముఖ్యోద్దేశం. ఎవరైనా తరగతులకు గైర్హాజరైతే దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. వారు హాజరయ్యేలా ప్రిన్సిపాళ్లకు బాధ్యత అప్పగించారు. ప్రతి 15 రోజులకోసారి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల స్థితిగతులపై చర్చించాలి. వారు ఒత్తిడి, వ్యసనాల బారినపడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పోలీసు, ఇతర శాఖల అధికారులు, మానసిక వైద్యులు, నిపుణులతో అవగాహన కల్పించాలి. ఇదే సమయంలో తరగతి గదుల్లో ఎదురయ్యే ఇబ్బందులను తెలుసుకుని.. వాటిని అధిగమించేలా చేయూత ఇవ్వడం అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లను అప్రమత్తం చేయాలి. అన్ని రకాల యాజమాన్యాలతో కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షలు జరపాలి.

**పకడ్బందీగా కార్యాచరణ**

మూణ్నెల్ల ప్రణాళిక అమలును జిల్లాలో చేపట్టాం. ప్రయోగ పరీక్షల నిర్వహణపరమైన ఇబ్బందుల్లేకుండా ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని ఉన్నతాధికారులు చెప్పారు. ప్రతి కళాశాలలో విద్యార్థులు రాణించేలా అధ్యాపకులు కీలక పాత్ర పోషించాలి. వారి అభ్యసన సామర్థ్యాలను గుర్తించడం, వెనుకబడిన వారిని మెరుగుపరిచే బాధ్యతను తీసుకోవడం మరవొద్దు ప్రిన్సిపాళ్ల నిరంతర పర్యవేక్షణ కొనసాగాలి. వెంకటేశ్వరరావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

# సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో వృద్ధి అంతంతే..!

కొత్తగూడెం : పొరుగున ఉన్న ఒడిశా రాష్ట్రం బొగ్గు ఉత్పత్తిలో ఏటేటా వృద్ధిని నమోదు చేస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా నాలుగు ఉమ్మడి జిల్లాల్లో విస్తరించిన సింగరేణి ఈ విషయంలో కాస్త వెనుకబడింది. ఆశించిన విధంగా కొత్త గనులను వినియోగంలోకి తేకపోవడమే ఇందుకు కారణమని యాజమాన్యం భావిస్తోంది. ప్రస్తుత అవరోధాలను అధిగమించి వచ్చే ఏడాది ఉత్పత్తి నమోదులో అధిక వృద్ధిని సాధించే దిశగా అడుగులు వేస్తోంది.సింగరేణిలో సంస్థ బొగ్గు ఉత్పత్తిలో గత మూడేళ్లలో పెద్దగా వృద్ధి నమోదుకాలేదు. 2021-22 ఉత్పత్తి సంవత్సరంలో 67.23 మిలియిన్ టన్నులుండగా, గత వార్షిక సంవత్సరం (2023-24) ఇది 72.52 మి.ట.గా నమోదైంది. 2024-25 సంవత్సరం 74 మి.ట. లక్ష్యాన్ని మాత్రమే విధించుకుంది. అయినా కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కాకపోవడంతో గతేడాది లక్ష్యం వద్దే నిలిచిపోయే పరిస్థితి నెలకొంది.

**నాలుగు ఉపరితల గనులపైనే ఆశ**

ప్రస్తుత ఉత్పత్తి సంవత్సరంలో మరో నాలుగు ఉపరితల గనులను ప్రారంభించాలని సింగరేణి కృతనిశ్చయంతో ఉన్నా పలు అవాంతరాలతో అది సాధ్యం కావడం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వీకే ఓసీ, రొంపేడు, బెల్లంపల్లి ఏరియా గోలేటి, ఒడిశా రాష్ట్రంలోని నైనీ కోల్‌బ్లాకులలో సాధ్యమైనంత త్వరగా ఈ ఏడాదే బొగ్గు వెలికితీయాలని ఉన్నతాధికారులు భావించారు. ఒక్క నైనీ బ్లాక్ మినహా మిగతా వాటికి అటవీశాఖ నుంచి పూర్తి అనుమతులు రాకపోవడంతో ఆలస్యం జరుగుతోంది. ఒడిశాలో మాత్రం ఉత్పత్తి దిశగా పనులు కొనసాగుతున్నాయి. కొత్తగూడెం ఏరియా వీకే ఓసీకి ఇటీవలే ఫేజ్-1 అనుమతులు లభించాయి. రొంపేడు, గోలేటి ఓసీలకూ ఈ అనుమతులొచ్చాయి. వీటికి ఫేజ్-2 అనుమతులు లభిస్తే ఉత్పత్తి ప్రారంభానికి మార్గం సుగమం అవుతుంది. ప్రస్తుత వార్షిక సంవత్సరాంతానికైనా ఉత్పత్తి పనులు మొదలు పెట్టాలని యాజమాన్యం భావిస్తోంది.

**ఏ గనికి ఎంతెంత లక్ష్యం**

ప్రస్తుత సంవత్సరం నుంచే వీకే కోల్‌మైన్‌లో 43 లక్షలు, ఇల్లెందు రొంపేడు ఓసీలో 20 లక్షలు, గోలేటి ఓసీలో మరో 35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. కానీ, అనుమతుల్లో జాప్యంతో ఆయాచోట్ల ఫిబ్రవరి, మార్చి నెలల్లోనైనా కనీస ఉత్పత్తి నమోదు చేయాలని యాజమాన్యం భావిస్తోంది. వీకే ఓసీలో 7, రొంపేడు ఓసీలో 3, గోలేటి ఓసీలో కనీసం 5 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసే దిశగా ప్రయత్నాలు చేపట్టింది. మరో ముఖ్యమైన గని నైనీ కోల్ బ్లాకులో (ఒడిశా) 10కి గాను ఒకట్రెండు మిలియన్ టన్నులైనా ఉత్పత్తి చేయాలని భావిస్తోంది. ఇక్కడ కనీసం జనవరిలోపైనా బొగ్గు తవ్వకాలను చేపట్టాలనేది లక్ష్యం.

'సింగరేణిలో ప్రారంభించాల్సిన కొత్త ఉపరితల గనులకు కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు సకాలంలో రాకపోవటంతో ఉత్పత్తి జాప్యమవుతోంది. అయినా ఉద్యోగుల సహకారంతో సాలీనా ఉత్పత్తి లక్ష్యాన్ని కొంతైనా పెంచుకొంటూ పోతున్నాం. కొత్త ఓసీల ప్రారంభంతో వచ్చే ఉత్పత్తి సంవత్సరం నుంచి బొగ్గు వెలికితీతలో గణనీయమైన వృద్ధి నమోదవుతుంది'. ఎన్.బలరాం, సీఎండీ

